

ఉత్సాహంగా నృత్యాలు చేస్తున్న పార్టీ శ్రేణులు



రోడ్‌షో సందర్భంగా ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి కేటీఆర్, విప్ గంప గోవర్ధన్

- కేసీఆర్‌కు అఖండ మెజార్టీ ఇయ్యాలే..
- ఏడాదిలో గోదావరి జలాలు
- యావత్ తెలంగాణ కేసీఆర్‌కు లోకల్
- కేసీఆర్ పూర్వీకుల గ్రామం కోనాపూరే
- బీజేపోడిది ఎల్లారెడ్డి, కాంగ్రెసోడిది కొడంగల్
- వార్డుకో మహిళా సమాఖ్య భవనం నిర్మిస్తాం
- కామారెడ్డి రోడ్ షోలో మంత్రి కేటీఆర్

# కామారెడ్డి అభివృద్ధికి నాది భరోసా


నిజామాబాద్, నవంబర్ 28, (నమస్తే తెలంగాణ ప్రతినిధి) / కామారెడ్డి :

మతం, కులం తిండి పెట్టదని, మతం పేరిట బీజేపోడు రాజకీయం చేస్తుంటే, కాంగ్రెసోడు కులం పేరిట రాజకీయం చేస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కామారెడ్డిలో విద్యా సంస్థలు రావాలంటే... అభివృద్ధి జరగాలంటే మన పిల్లల భవిష్యత్తు కోసం కేసీఆర్‌ను గెలిపించుకోవాలని చెప్పారు. కామారెడ్డికి కేసీఆర్ వచ్చారంటే ఏమొస్తుందో ప్రజలంతా ఆలోచన చేయాలన్నారు. ఈ ప్రాంతానికి గోదావరి జలాలు తప్పక వస్తాయని తెలిపారు. ఏడాది లోపు తీసుకు వచ్చే బాధ్యత తనదని కేటీఆర్ ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డి పట్టణంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎంపీ బీబీపాటిల్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్‌లతో కలిసి కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు. కొంత మంది దౌర్భాగ్యులు తెలిసీ తెలియని వారు ఏదేదో మాట్లాడుతున్నారని చెప్పారు. భూములు గుంజుకునేందుకు వస్తున్నారని అసత్య ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కామారెడ్డి భూముల్లో లంకె బిందెలున్నాయా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎవడు పడితే వాడు... ఏది పడితే అది మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కామారెడ్డి భూములు లాక్కునేంత అవసరం మాకెందుకు ఉంటుందన్నారు. ఇక్కడి ప్రజల బతుకులు మారాలని కేసీఆర్ వచ్చారని చెప్పారు. నెర్రెలు బారిన నేలలు పచ్చబడాలన్నారు. మీ భూములు మాకెందుకు అంటూ కేటీఆర్ కుండ బద్ధలు కొట్టి చెప్పారు. ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు కేసీఆర్ వస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం అంటే పారిశ్రామిక వేత్తలు ఎంతో మంది ముందుకు వస్తారన్నారు. గజ్వేల్‌లో ఎంతో మంది లైన్ పట్టి పెట్టుబడులు పెట్టారన్నారు. కామారెడ్డిలో విద్యా సంస్థలు, పెద్ద ఎత్తున కాలేజీలు వస్తాయన్నారు. విద్యా సౌలతి మరింత పెరుగుతుందని చెప్పారు.

**బీజేపీ, కాంగ్రెస్... నాన్ లోకల్...**

కేసీఆర్‌ను నాన్ లోకల్ అంటుండడం సిగ్గుచేటని కేటీఆర్ చెప్పారు. అన్ని రాష్ట్రాలకు సీఎం ఉంటారు... ఇక్కడ రాష్ట్రాన్ని తెచ్చిన సీఎం ఉన్నారన్నారు. కేసీఆర్‌కు లోకల్, నాన్ లోకల్ ఉంటదా అని అడిగారు. రేవంత్ రెడ్డిది కొడంగల్, బీజేపోడిది ఎల్లారెడ్డి అని చెప్పారు. ఎవడు లోకల్ ఎవడు నాన్ లోకల్ ప్రజలు గుర్తెరగాలన్నారు. కేసీఆర్ అమ్మగారిది బీబీపేట కోనాపూర్ అని గుర్తు చేశారు. పొరపాటున సన్నాసులకు ఓటేస్తే ఊదు కాలదు పీరు లేవదన్నట్లుగా ఉంటుందన్నారు. బీజేపోడికి బుడ్డపైస తెచ్చే దమ్ముందా.. నయాపైసా తెస్తడా ఓటేసి బతుకులు కరాబ్ చేసుకోవద్దు అంటూ ప్రజలకు సూచన చేశారు. అదృష్టం వచ్చి కాలింగ్ బెల్ కొడితే... సైకిల్ బెల్ అనుకుని సైడ్ ఇచ్చిండంట అట్లనే బీజేపీకి, కాంగ్రెస్‌కు ఓటేస్తే ఇక్కడోళ్లకు కూడా ఆలోచన లేనట్లేనని కేటీఆర్ చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ వారికి ఓటేస్తే లాభం జరగదన్నారు. బీజేపీకి ఓటేస్తే బుడ్డపైసా రాదన్నారు. డిసెంబర్ 3 తర్వాత రాష్ట్రానికి ముఖ్యమంత్రి కేసీఆరేనని అన్నారు. సీఎం వచ్చాక కామారెడ్డికా తక్‌దీర్ బదల్ జాత అంటూ చెప్పారు. 55 ఏండ్లు ఒక ఎత్తు.. ఈ ఐదేండ్లు ఒక ఎత్తు అన్నారు. కామారెడ్డి అభివృద్ధి బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. ఏదేదో మాట్లాడటోన్ని పట్టించుకోవద్దని, కామారెడ్డి పట్టణంలో మీకు ఏమేమి పనులు మిగిలిపోయినయో అవన్నీ పూర్తి చేస్తామని చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ చేసుడు బీజేపోడితో అవుతుందా? అంటూ ప్రశ్నించారు.





బిల్డింగులపైకి ఎక్కి కేటీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న ప్రజలు

## వార్డుకో మహిళా సమాఖ్య భవనం..

కామారెడ్డి పట్టణంలో మీ అందరికీ ప్రతి వార్డులో ఒక మహిళా సమాఖ్య భవనం కట్టిస్తానంటూ కేటీఆర్ హామీ ఇచ్చారు. రోడ్‌షోకు వచ్చిన మహిళనుద్దేశించి ఈ వాగ్దానం చేశారు. అసైన్డు పట్టాలున్న వారికి హక్కులిస్తామన్నారు. హక్కు పత్రాలతో దశాబ్దాలుగా భూములను అమ్ముకోలేక బాధ పడుతున్న వారంతా స్వేచ్ఛగా బదలాయింపు చేసుకోవచ్చన్నారు. కామారెడ్డికి కేసీఆర్ రూపంలోనే అదృష్టం నడుచుకుంటూ వస్తుందన్నారు. బ్రహ్మాండంగా మెజార్టీ ఇయ్యాలన్నారు. వాడెవడో... వీడెవడో చెప్పిండని ఆగం కావొద్దని హితవు పలికారు. చెవిలో పువ్వులకు, చేతులకు ఓటెయ్యొద్దన్నారు. కామారెడ్డికి తప్పకుండా వారం రోజులకోసారి వస్తానని చెప్పారు. మీకు అండగా ఉంటానంటూ ప్రజలకు వాగ్దానం ఇచ్చారు. వచ్చే ప్రభుత్వంలో కొత్త స్కీములు కూడా చాలా రాబోతున్నాయని అన్నారు. సౌభాగ్యలక్ష్మి పేరిట 18 ఏండ్లు నిండిన మహిళలకు డిసెంబర్ 3 తర్వాత నెలకు రూ.3వేలు కేసీఆర్ ఇయ్యబోతున్నారని తెలిపారు. జనవరి నెలలో కొత్త తెల్ల రేషన్ కార్డులు ఇస్తామని పేర్కొన్నారు. దొడ్డు బియ్యం స్థానంలో ప్రజలంతా తినే విధంగా అన్నపూర్ణ స్కీం కింద సన్నబియ్యం ఇస్తామని కేటీఆర్ తెలిపారు. బీజేపోడితో ఇలాంటివి అమలవుతాయా? అని ప్రశ్నించారు. రైతులకు బీమా ఇచ్చినట్లే పొలం లేనోళ్లకు తెల్లరేషన్ కార్డుంటే రూ.5లక్షల జీవిత బీమాను వర్తింపజేయనున్నట్లుగా చెప్పారు.

## మోసం మోదీ నైజం...

వచ్చే ప్రభుత్వంలో బీడీ కార్మికులకు పీఎఫ్ కటాఫ్ డేట్‌ను ఎత్తేసి మిగిలి పోయిన లక్ష మందికి బీడీ పింఛన్లు ఇస్తామన్నారు. ప్రస్తుతం నాలుగున్నర లక్షల మందికి బీడీ పింఛన్లు ఇచ్చిన కేసీఆర్‌కు లక్ష మందికి ఇయ్యలేడా? అని అన్నారు. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువుండదన్నట్లుగా అన్ని పనులూ అవుతాయని చెప్పారు. గట్టిగా గుద్దుడు గుద్దితే 30 తారీఖు నాడు దమ్ము చూపాలె... దుమ్ము రేపాలె... అఖండ మెజార్టీతో కేసీఆర్‌ను గెలిపియ్యాలే అంటూ కేటీఆర్ పిడికిలి బిగించి ప్రజలందరితో జై కొట్టించారు. ప్రతి ఊర్లో, బస్తీలో న్యాయం కావాలంటే కేసీఆర్‌ను గెలిపించుకోవాలని కేటీఆర్ సూచించారు. ప్రజల కోసం మోదీ ఏమీ చేయలేదన్నారు. ఇక్కడ బీజేపోడు సలాకాలు, సిమెంట్ బస్తాలు ఇచ్చుకుంటా తిరుగుతున్నడని ఎద్దేవా చేశారు. మోదీ వల్ల నిత్యావసరాలు పిరం అయ్యాయని చెప్పారు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చిన్నాడు గ్యాస్ సిలిండర్ ధర కేవలం రూ.400 ఉండేదని ఇప్పుడది రూ.800 పెంచి రూ.1200 చేశారని మండిపడ్డారు. మోదీ పెంచిన రూ.800 ధరను కేసీఆర్ భరిస్తానని చెబుతున్నారని గుర్తు చేశారు. మూడోసారి ఏర్పాటయ్యే ప్రభుత్వంలో రూ.400లకే సిలిండర్ ఇవ్వబోతున్నట్లుగా పేర్కొన్నారు. మోదీ పాలనలో పాలు, పెరుగు, ఉప్పు పిరం అయితదని, బతుకు భారమై సామాన్యుడు బతికే పరిస్థితి ఉండదని చెప్పారు. రోడ్‌షోలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎంపీ బీబీపాటిల్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి, బీఆర్‌ఎస్ నాయకులు నిట్టు వేణుగోపాల్, పున్నా రాజేశ్వర్, వకీల్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# నాగమడుగు లిఫ్ట్‌తో ప్రతి గుంటకూ సాగునీరు

- బీఆర్‌ఎస్ హయాంలోనే రహదారులకు మోక్షం
- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ దవాఖానలు
- నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటా..
- జుక్కల్ ఎమ్మెల్యే అభ్యర్థి హన్మంత్‌షిండే






పిట్లంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి షిండే, హాజరైన జనం

పిట్లం, నవంబర్ 28: నాగమడుగు లిఫ్ట్ ద్వారా మండలంలోని ప్రతి గుంటకూ సాగునీరు అందుతుందని, దీని నిర్మాణం కోసం సీఎం కేసీఆర్ రూ.476కోట్ల నిధులను మంజూరు చేశారని జుక్కల్ ఎమ్మెల్యే అభ్యర్థి హన్మంత్‌షిండే అన్నారు. ఆయన మంగళవారం పిట్లంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు శివాజీ చౌరస్తా నుంచి భాజాభజంత్రీల మధ్య ఆయనకు భారీ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షిండే మాట్లాడారు. 50ఏండ్లు పాలించిన గత ప్రభుత్వాలు ఏనాడూ నియోజకవర్గ అభివృద్ధి గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం వంద గ్రామాలకు బీటీ రోడ్లు, ప్రధాన రహదారులపై లో లెవెల్, హై లెవెల్ వంతెనల నిర్మాణం చేపట్టామని తెలిపారు. నియోజకవర్గంలో కార్పొరేట్ దవాఖానలకు దీటుగా ప్రభుత్వ వైద్యశాలలు పనిచేస్తున్నాయని, బిచ్కుందలో వంద పడకలు, పిట్లంలో 50 పడకల దవాఖానలు ఏర్పాటుచేసి మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామని అన్నారు. తన చితి కాలేవరకు నియోజకవర్గ ప్రజలకు తోడుగా ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. గురువారం నిర్వహించే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా కార్యకర్తలు, అభిమానులు ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వాసరి రమేశ్, బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణారెడ్డి, అన్నారం వెంకట్‌రాంరెడ్డి, కుమ్మరి రాములు, ప్రతాప్‌రెడ్డి, విజయ్, శపథంరెడ్డి, సాయిరెడ్డి, బాల్‌రెడ్డి, బాబూసింగ్, ఏఎంసీ చైర్‌పర్సన్ సావిత్రి, పిట్లం సర్పంచ్ విజయలక్ష్మి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, రైతుబంధు సమితి గ్రామ అధ్యక్షుడు జొన్న శ్రీనివాస్‌రెడ్డి, యువ నాయకులు వేణుమాధవరెడ్డి, రవిచంద్ర, నర్సాగౌడ్, జగదీశ్, బుడాల నవీన్, శశిధర్, నవీన్‌రెడ్డి, ఎర్ర రమేశ్, లక్ష్మణ్ యాదవ్, వార్డుసభ్యులు, ఎంపీటీసీలు, ఆయా గ్రామాల సర్పంచులు, విండో చైర్మన్లు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

పిట్లం గ్రామానికి చెందిన వ్యాపారవేత్త, కాంగ్రెస్ నాయకుడు గంగ సందీప్ ఎమ్మెల్యే షిండే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పలు గ్రామాలకు చెందిన 20 మంది కూడా బీఆర్‌ఎస్‌లో చేరగా.. ఎమ్మెల్యే షిండే వారికి గులాబీ కుండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారి వెంట పిట్లం జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పెద్దకొడప్‌గల్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



# స్థానికుడిని ఆదరించండి..

- నాన్‌లోకల్‌ను బొంద పెట్టండ్రి
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్
- సదాశివనగర్, తాడ్వాయి మండలాల్లో విస్తృతంగా ప్రచారం





అడ్లూర్ ఎల్లారెడ్డి లో ఎమ్మెల్యే కు స్వాగతం పలికేందుకు మంగళ హారతులు, పూలతో సిద్ధంగా ఉన్న మహిళలు, పోతరాజుల విన్యాసాలు

సదాశివనగర్, నవంబర్ 28: స్థానికుడైన తనను ఆదరించాలని, నాన్ లోకల్ అభ్యర్థిని ఎన్నికల్లో బొంద పెట్టాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. కోట్ల రూపాయల నిధులతో అడ్లూర్ ఎల్లారెడ్డిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని తెలిపారు. ఎన్నికల ప్రచారానికి మంగళవారం చివరి రోజు కాగా.. ఎమ్మెల్యే జాజాల అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు మహిళలు మంగళ హారతులు, బోనాలతో స్వాగతం పలుకుతూ పూల వర్షం కురిపించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు, గ్రామస్తులు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.. గ్రామం నుంచి హైవే వరకు డబుల్ రోడ్డు నిర్మించడంతో పాటు ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి అందరినీ భయపెడుతూ గుండాయిజం చేస్తున్నాడని ఆరోపించారు. ఇప్పటి వరకు జరిగిన అన్ని ఎన్నికల్లో ప్రజలు అన్నదమ్ముల వలె కలిసి మెలసి ఉంటూ ఓట్లు వేశారని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ బెదిరింపులకు పాల్పడుతున్నాడని, ఆయన బెదిరింపులకు ప్రజలు భయపడరన్నారు. ఆయనకు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు సూచించారు. ప్రచారంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, సర్పంచ్ పైడి జానకీ జనార్దన్ యాదవ్, ఎంపీపీ అనసూయ, జడ్పీటీసీ నర్సింహులు, ఎంపీటీసీ ఎడ్ల రేణుక నర్సింహులు, మాజీ వైస్ ఎంపీపీ ఆకుల విఠల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సాదిక్ అలీ, ఆకుల సిద్ధిరాములు, ఆకుల శివదినం, లింబయ్యగారి శేఖర్‌రెడ్డి, ఆకుల వెంకట్‌రాములు, ఆకుల గంగరాజం, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఆస మహేశ్, ఆస రాజు, సాగర్ రెడ్డి, నవీనా రెడ్డి, కందూరి బీరయ్య, మర్కంటి బుచ్చన్న, శ్రీనివాస్ నాయక్, వడ్ల రవి, పోతరాజు నరేశ్, అయిండ్ల రాజు, రంగ మోహన్, శేకెల్లి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## మరింత అభివృద్ధి చేస్తా..

తాడ్వాయి, నవంబర్ 28: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని, ఆదరించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని, స్థానికంగా ఉండే తనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఓటర్లను కోరారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, దేవాయిపల్లి, తాడ్వాయి, ఎర్రాపహాడ్, ఎండ్రియాల్, నందివాడ, దేమికలాన్, కన్‌కల్, కరడ్‌పల్లి గ్రామాల్లో ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలుకగా.. మహిళలు బోనాలు, యువకులు నృత్యాలతో ప్రచారంలో పాల్గొన్నారు. కేసీఆర్ సీఎం అయితేనే అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉంటాయని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే మోసపు మాటలను నమ్మొద్దని సూచించారు. కారు గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిందర్‌రెడ్డి, ఎంపీపీ రవి, ఏఎంసీ చైర్మన్ సాయిరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, జడ్పీటీసీ రమాదేవి, వైస్ ఎంపీపీ నర్సింహులు, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, సాయిరెడ్డి, నర్సారెడ్డి, గోపాల్‌రావు, రమేశ్‌రావు, రవీందర్‌రెడ్డి, గంగాధర్, రాజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజయ్య, పౌరాజు, ప్రభాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తాడ్వాయిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్